సాక్షి వికారాబాద్

బుధవారం ; 30 ; ఏప్రిల్ ; 2025




చోరీలతో బెంబేలు!

వరుస చోరీలు హడలెత్తిస్తున్నాయి. తాళం వేసిన, నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లే లక్ష్యంగా దుండగులు రెచ్చిపోతున్నారు. 8లో▸



భూ సమస్యల పరిష్కారానికే..

భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ అన్నారు. 8లో▸



డబుల్ ట్రబుల్!

అధికారుల నిర్లక్ష్యమో, పాలకుల అలసత్వమో వెరసి లబ్ధిదారులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కలగానే మిగిలింది. 9లో▸

న్యూస్‌రీల్

అనాథ పిల్లలకు వసతి, భోజనం

కలెక్టర్ ప్రతీక్‌జైన్



అనంతగిరి: జిల్లాలో 7 నుంచి 18 సంవత్సరాల లోపు అనాథ పిల్లలు ఉన్నా.. ఇప్పటి వరకు వసతి గృహాల్లో చదివి వేసవి సెలవుల్లో ఎక్కడ ఉండాలో తెలియని చిన్నారులకు వసతి, భోజన సదుపాయం కల్పించనున్నట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాంటి పిల్లలు ఉంటే చైల్డ్ హెల్ప్ లైన్ నంబర్ 1098కు కాల్ చేస్తే వారు బాలసదన్‌లో, ఇతర చైల్డ్ కేర్ సెంటర్లలో వసతి, భోజన సదుపాయం కల్పిస్తారని తెలిపారు. మరిన్ని వివరాల కోసం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ వెంకటేశం, డీసీపీఓ శ్రీకాంత్, బీఆర్‌బీ కోఆర్డినేటర్ కాంతారావు, సంక్షేమ శాఖ జిల్లా అధికారి జయసుధను సంప్రదించాలని కలెక్టర్ సూచించారు.

భూ భారతితో రైతులకు మేలు

అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్

కుల్కచర్ల: భూ భారతి చట్టంతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అడిషనల్ కలెక్టర్ లింగ్యానాయక్ తెలిపారు. మంగళవారం కుల్కచర్ల, చౌడాపూర్ మండల కేంద్రాల్లో కొత్త చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూ సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం ఈ చట్టాన్ని తెచ్చిందని పేర్కొన్నారు. కుల్కచర్లలో కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఆంజనేయులు ముదిరాజ్, వైస్ చైర్మన్ రామ్మోహన్ శర్మ, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, వైస్ చైర్మన్ నాగరాజు, కాంగ్రెస్ పార్టీ చౌడాపూర్ మండల అధ్యక్షుడు అశోక్ కుమార్, తహసీల్దార్ ప్రభులు, ఎంపీడీఓ సోమలింగం, సీనియర్ అసిస్టెంట్ లింగయ్య, యువజన కాంగ్రెస్ చౌడాపూర్ మండల అధ్యక్షుడు రాము, సోషల్ మీడియా కోఆర్డినేటర్ భాస్కర్, మార్కెట్ కమిటీ డైరక్టర్ భరత్ కుమార్ రెడ్డి, వ్యవసాయాధికారి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

నేర రహిత సమాజాన్ని నిర్మిద్దాం

ఎస్పీ నారాయణరెడ్డి



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న ఎస్పీ

మోమిన్‌పేట: నేర రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎస్పీ నారాయణరెడ్డి కోరారు. మంగళవారం మోమిన్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో 34 సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమన్నారు. ప్రతి గ్రామంలో కెమెరాలు ఏర్పాటు చేసుకునేందుకు ముందుకు రావాలని కోరారు. కేసుల విచారణకు నిఘా నేత్రాలు ఎంతగానో ఉపయోగ పడతాయన్నారు. ప్రజలు ఇళ్ల వద్ద, వ్యాపారులు దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ వెంకట్, ఎస్ఐ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పడి కొబ్బరిచెట్టుపై మంటలు



కొత్లాపూర్‌లో కొబ్బరిచెట్టుపై పిడుగు పడటంతో చెలరేగిన మంటలు

తాండూరు రూరల్: మండల పరిధిలోని కొత్లాపూర్‌లో మంగళవారం పిడుగుపడింది. గ్రామానికి చెందిన బైండ్ల రాంచందర్ ఇంట్లోని కొబ్బరిచెట్టుపై పిడుగుపడి మంటలు చెలరేగాయి. కొబ్బరి చెట్టు సమీపంలో మేకాల వెంకటప్ప బాత్‌రూంలో స్నానం చేస్తుండగా చేతికి స్వల్పగాయామైంది. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. పిడుగు పడటంతో గ్రామస్తులు సంఘటనస్థలానికి చేరుకొని దెబ్బతిన్న కొబ్బరిచెట్టును పరిశీలించారు.

ఆక్రమణలు ఆపేదెవరు!

కోర్టు ఆదేశాలనూ పట్టించుకోని వైనం



పరిగి మున్సిపల్ పరిధిలో వివాదాస్పద భూమిలో నాలాను ఆక్రమించి నిర్మించిన ప్రహరీ

- నాలాలు, వాగులను సైతం వదలని అక్రమార్కులు
- దర్జాగా కబ్జా చేసి కంచెలు, ప్రహరీల నిర్మాణం
- అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

వికారాబాద్: పై ఫొటోలో కనిపిస్తున్న ప్రహరీ నిర్మాణం పరిగి మున్సిపల్ పరిధిలోని నజీరాబాద్ రెవెన్యూ సర్వే నంబర్ 99లో చేపట్టారు. కొందరు వ్యక్తులు ఆ భూమిలో మున్సిపల్ అధికారుల అనుమతి లేకుండా నిర్మాణ పనులు చేపట్టారు. రెవెన్యూ నుంచి నాలా కన్వర్షన్ కూడా చేయలేదు. వాల్టా చట్టాన్ని తుంగలో తొక్కి బోరుబావి తవ్వించారు. రికార్డుల్లో ఉన్న నాలాను సైతం కలిపేసుకున్నారు. ఇందులో మరో ట్విస్టుకూడా ఉంది. అసలు ఈ సర్వే నంబర్ భూమి ఇరువురి మధ్య వివాదంతో కోర్టు పరిధిలో కేసు నడుస్తోంది.. బాధిత వ్యక్తి మరోసారి కోర్టును ఆశ్రయించగా ఆ సర్వే నంబర్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదని.. ఆ దిశగా చర్యలు తీసుకోవాలని మున్సిపల్, ఇరిగేషన్ శాఖల అధికారులను ఆదేశించింది. అయితే వివాదాస్పద స్థలంలో నిర్మాణాలు జరుగుతున్నా.. నాలాను పూడ్చేసినా ఆయా శాఖల అధికారులు పట్టించుకోవడంలేదు. అక్రమ నిర్మాణాలు చేపట్టే సమయంలో బాధిత రైతు పలుమార్లు అధికారుల ఫిర్యాదు చేశారు. కోర్టు ఇచ్చిన నోటీసులు చూపాడు. కానీ ఫలితం లేకపోయింది. ఇది ఒక ఉదాహరణ మాత్రమే.. ఇలాంటి కబ్జాలు వికారాబాద్, తాండూరు, కొడంగల్, పరిగి మున్సిపల్ పరిధిలో అనేక చోట్ల జరుగుతూనే ఉన్నాయి. ఫిర్యాదులు అందినా.. అధికారులు లంచాలకు ఆశపడి కబ్జా కోరులకే వత్తాసు పలకుతున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు.

చూసీచూడనట్లుగా..

భూ కబ్జాకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. భూముల ధరలు భారీగా పెరిగిన నేపథ్యంలో కబ్జాలకు మరింత ఆజ్యం పోస్తున్నాయి. చెరువులు, కుంటలు, నాలాలు, వాగులు.. దారులు ఇలా దేన్నీ వదలడం లేదు. మున్సిపాలిటీల పరిధిలో భూములకు రెక్కలు రావడంతో ప్రభుత్వ స్థలాలు, చెరువులు, కుంటలను సైతం మింగేస్తున్నారు. ప్రైవేటు భూముల్లోనూ వివాదాలు సృష్టించి సెటిల్‌మెంట్లు చేసుకొని సొమ్ము చేసుకుంటున్నారు. మరి కొన్ని చోట్ల చెరువులను ఆక్రమించి పంటలు వేస్తున్నారు. ఆ పొలాలు తమవేనంటూ కంచెలు కూడా వేసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల ఆక్రమించుకున్న భూములను విక్రయించి జేబులు నింపుకొంటున్నారు. ఈ విషయం అధికారుల దృష్టికి వచ్చినా.. ఎవరైనా ఫిర్యాదు చేసినా.. విచారణ పేరుతో సాగతీస్తున్నారే తప్ప ఎలాంటి చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. కబ్జారాయుళ్లు చెరువు శిఖాలను, బఫర్ జోన్ల సైతం వదలడం లేదు. తహసీల్దార్ మొదలుకొని ఇరిగేషన్, మున్సిపల్, పోలీసు, అడిషనల్ కలెక్టర్, కలెక్టర్ వరకు ఫిర్యాదులు అందినా ఎవరూ స్పందించిన దాఖలాలు లేవు.

రికార్డులు తారుమారు

చెరువులు, కుంటలు, దారులు, పొనాదులు, నాలాలకు సంబంధించిన రికార్డులు చాలా వరకు తారుమారయ్యాయి. రెవెన్యూ రికార్డులే కాకుండా నీటిపారుదల శాఖ వద్ద కూడా చెరువులకు సంబంధించిన రికార్డులు కనిపించడం లేదు. కొన్ని చెరువులు భౌతికంగా కనిపిస్తున్నా రికార్డుల్లో మాత్రం చెరువు కనిపించడం లేదు. పొనాదులు, నాలాలు పూడ్చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు అక్రమార్కులకు అండగా నిలుస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కబ్జాలు జరుగుతున్నట్లు వార్తలు వస్తే అధికారులు అక్రమార్కులతో కుమ్మక్కై వారికి వంత పాడుతున్నారు. అంతా తామే చూసుకుంటామని భరోసా ఇస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. ఇప్పటికైనా చెరువులు, కుంటలు, దారులు ఆక్రమణలకు గురికాకుండా జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

చెరువులు, నాలాల కబ్జా

గతంలో మిషన్ కాకతీయ పథకం కింద చెరువుల, కుంటల్లో అభివృద్ధి పనులు చేపట్టారు. పూడిక తీయడంతోపాటు ఎక్కడైన చెరువులు ఆక్రమణకు గురైతే ఆ భూమిని స్వాధీనం చేసుకొని హద్దులు ఏర్పాటు చేయాలని అప్పటి ప్రభుత్వం ఆదేశాలు కూడా జారీ చేసింది. అయితే నీటి పారుదల శాఖ అధికారులు ఏ చెరువులో కూడా కబ్జాల జోలికి వెళ్లలేదు. దీంతో ఆక్రమణలు ఇంకా పెరుగుతూ వచ్చాయి. ప్రధానంగా మున్సిపల్ కేంద్రాలకు సమీపంలోని చెరువులు, నాలాలే ఎక్కువగా కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి.

ఆక్రమణలకు గురైనవి..

వికారాబాద్ సమీపంలోని శివారెడ్డిపేట చెరువు, కొంపల్లి చెరువు, తాండూరుకు ఆనుకొని ఉన్న గొల్లచెరువు, పరిగి టెలిఫోన్ ఎక్స్చేంజ్ వెనుకగల నాలా, అనురాగ్, మైత్రి వెంచర్లకు ఆనుకొని ఉన్న నాలాలు ఆక్రమణలకు గురయ్యాయి.



మాట్లాడుతున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, చిత్రంలో మంత్రి శ్రీధర్‌బాబు, మండలి చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి తదితరులు

ఒట్టేసింది నిజమే కానీ..

- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేక హామీల అమలులో జాప్యం
- స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

మోమిన్‌పేట: ఎన్నికల సమయంలో దేవుళ్లపై ఒట్టేసి హామీలు ఇచ్చిన మాట నిజమేనని కానీ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేక హామీల అమలులో జాప్యం జరుగుతోందని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఏజేఆర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిందని.. అధికారం చేపట్టాక గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం బయటపడిందన్నారు. వారు చేసిన అప్పులకు వడ్డీలు కడుతూ రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంతి వైఎస్ రాజశేఖర రెడ్డి ఉమ్మడి రంగారెడ్డి జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును ప్రారంభిస్తే ఆ తర్వాత వచ్చిన బీఆర్ఎస్ ప్రభుత్వం చుక్క నీరు రాకుండానే ప్రాజెక్టును రద్దు చేసిందన్నారు. సాగునీటి వసతి లేక వికారాబాద్ జిల్లా రైతాంగం పూర్తిగా వర్షాధార పంటలపైనే ఆధారపడాల్సి వస్తోందన్నారు. గత ప్రభుత్వం జిల్లాను ఎడారిగా మార్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం జిల్లాలో పారిశ్రామిక వాడలను ఏర్పాటు చేసి ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోందన్నారు. జిల్లాలోని నాలుగు ప్రధాన రహదారుల విస్తరణకు కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కలిసి విన్నవించినట్లు తెలిపారు. రూ.10 వేల కోట్లతో రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. అనంతగిరులను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు రూ.వెయ్యి కోట్లతో మెగా సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మంత్రి శ్రీధర్‌బాబు, మండలి చీఫ్‌విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, సీనియర్ నాయకులు నరోత్తంరెడ్డి, సుభాష్‌గౌడ్, సురేందర్, సిరాజొద్దీన్, వేమారెడ్డి, ఎజాస్, మాణయ్య తదితరులు పాల్గొన్నారు.

ధరణి పోర్టల్‌తో దగా



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

- భూ భారతితో పేదలకు న్యాయం
- ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి: గత ప్రభుత్వం దొరలు, భూస్వాముల మేలు కోసం ధరణి పోర్టల్‌ను తెచ్చిందని ఎమ్మెల్యే టీ రామ్మోహన్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆధ్వర్యంలో భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం అనాలోచితంగా తెచ్చిన ధరణి ఎన్నో సమస్యలకు కారణమైందన్నారు. నేటికీ ప్రతి గ్రామంలో వందల సంఖ్యలో భూ సమస్యలు ఉన్నాయన్నారు. భూ భారతి చట్టంతో వాటన్నింటినీ పరిష్కరిస్తామని పేర్కొన్నారు. కొత్త చట్టం ద్వారా భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. భూ భారతితో భూ లావాదేవీలు, రిజిస్ట్రేషన్, మ్యుటేషన్, నిషేధిత భూములు, ఆర్ఓఆర్ మార్పులు, చేర్పులు సులభతరం అవుతాయన్నారు. జూన్ 2నుంచి ఈ చట్టం పూర్తిస్థాయిలో అమలులోకి వస్తుందని వివరించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ప్రతి రోజూ మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలోనే భూ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఈ చట్టం తెచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ వాసుచంద్ర, తహసీల్దార్ ఆనంద్‌రావు, డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, వైస్ చైర్మన్ అయూబ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



డీఎంహెచ్ఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

సమ్మెను జయప్రదం చేయండి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్

అనంతగిరి: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలకు నిరసనగా మే 20న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ కోరారు.మంగళవారం వైద్య శాఖలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులతో కలిసి డీఎంహెచ్ఓ వెంకటరవణకు సమ్మె నోటీసు అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైద్య శాఖలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి నెలా ఒకటో తేదీ వేతనాలు చెల్లించాలని కోరారు. అనేక పోరాటాలతో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను మార్చడం సరికాదన్నారు.కార్యక్రమంలో నాయకులు రామకృష్ణ, మంగమ్మ, మాధవి, లక్ష్మి, పాండు, వెంకట్ రాములు, సిరియాలు, సతీష్, బాలు పాల్గొన్నారు.

లాటరీ పద్ధతిన బార్ లైసెన్సు మంజూరు

అనంతగిరి: కొడంగల్ మున్సిపల్ పరిధిలో బార్ లైసెన్సు కోసం పలువురు టెండర్లు దాఖలు చేయగా మంగళవారం వికారాబాద్ కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిన లైసెన్స్ మంజూరు చేశారు. కొడంగల్ పట్టణంలో బార్ ఏర్పాటు కోసం 9 మంది దరఖాస్తు చేసుకోగా లాటరీలో సురేష్‌నాయక్ పేరు రావడంతో ఆయనకు మంజూరు చేశారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.



లాటరీ తీస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

తాటిముంజ.. తింటే మజా





అంతారం సమీపంలోని తాటివనాలు, తాటికాయల నుంచి ముంజలు తీస్తున్న యువకులు

సీజనల్ పండ్లకు డిమాండ్ ఎక్కువ.. ముఖ్యంగా వేసవి కాలంలో తాటిముంజలు అంటే ఇష్టపడని వారంటూ ఉండరు.. చల్లదనంతోపాటు ఆరోగ్యాన్ని పంచేవి కావడంతో ధర ఎక్కువైనా ప్రతి ఒక్కరూ కొనుగోలు చేస్తారు. తాటిముంజలకు పెట్టింది పేరు కుల్కచర్ల మండలం అంతారం గ్రామం.

నోరూరిస్తున్న సహజ ఫలం

- వేసవిలో చల్లదనంతోపాటు ఆరోగ్యాన్ని పంచే తాటిముంజలు
- పలువురికి ఉపాధి కల్పిస్తున్న వ్యాపారం
- తాటివనాలకు కేరాఫ్ అంతారం

కుల్కచర్ల: వేసవిలో ఎండ వేడి నుంచి ఉపశమనం పొందేందుకు ఎక్కువ మంది చల్లదనం ఇచ్చే పండ్లు, పండ్ల రసాలను ఎక్కువగా తీసుకుంటారు. ఇందులో తాటిముంజలు, వాటర్ మిలన్‌కు డిమాండ్ ఎక్కువగా ఉంటుంది. తాటికాయల్లో అధికపోషకాలు ఉండటంతో వాటిని ఇష్టపడతారు. పిల్లలు ఇష్టంగా తింటారు. ఏప్రిల్, మే మాసాల్లో ఇవి అధికంగా లభిస్తాయి. కుల్కచర్ల మండలం అంతారం, ఇప్పాయిపల్లి గేటు వద్ద తాటి వనాలు ఎక్కువగా ఉన్నాయి. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ తాటిముంజలను హోల్‌సేల్‌గా కొనుగోలు చేస్తుంటారు.

బీడు భూముల్లో..

తాటిచెట్ల పెంపకానికి పెద్దగా ఖర్చు రాదు. బీడు భూములు, పొలం గట్లపై వీటిని పెంచవచ్చు.ఇవి సుమారు 30 మీటర్ల ఎత్తు పెరుగుతాయి.తాటిచెట్ల ద్వారా తాటికల్లు, ముంజలు లభిస్తాయి. ప్రస్తుతం తాటిచెట్ల పెంపకానికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోంది. మొక్కలను ఉచితంగా అందజేస్తోంది.

పలువురికి ఉపాధి

తాటిచెట్ల వల్ల గ్రామీణ ప్రజలకు ఉపాధి లభిస్తోంది. తాటికల్లు, ముంజలు విక్రయించడం ద్వారా ఆర్థిక ప్రయోజనాలు పొందుతున్నారు. అంతారం గ్రామ సమీపంలో తాటి వనాలు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ లభించే ముంజలను హోల్‌సేల్‌గా విక్రయిస్తారు. నంచర్ల, మహబూబ్‌నగర్, వికారాబాద్, షాద్‌నగర్, మన్నెగూడ, వికారాబాద్, తాండూరు తదితర ప్రాంతాలకు చెందిన వారు ఇక్కడ ముంజలు కొనుగోలు చేసి వారివారి ప్రాంతాల్లో విక్రయించి ఉపాధి పొందుతున్నారు. వీరు కాకుండా ఈ మార్గంలో ప్రయాణం చేసే వారు ఎక్కువగా ముంజలను కొనుగోలు చేస్తుంటారు. కుల్కచర్ల మండలంలో సుమారు వంద కుటుంబాలు ఈ వ్యాపారం చేస్తూ ఉపాధి పొందుతున్నాయి.

పలు ప్రయోజనాలు

- వేసవిలో తాటిముంజలు తింటే అలసట రాదు. యాక్టివ్‌గా ఉంటారు.
- సాధారణంగా గర్భిణుల్లో అజీర్ణ సమస్య ఎక్కువగా ఉంటుంది. వారు లేత ముంజలు తింటే అజీర్ణ సమస్య నుంచి బయటపడొచ్చు.
- తాటిముంజల్లో ఏ, బీ, సీ విటమిన్లు, జింక్, పొటాషియం వంటివి పుష్కలంగా ఉంటాయి.
- వీటిలో నీటి శాతం ఎక్కువ.
- బరువు తగ్గడానికి ముంజలు ఎంతగానో ఉపయోగపడతాయి.

ఐదు పదుల వయస్సులో..

పక్క ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు వార్వాల చెన్నయ్య. యాభై ఏళ్ల వయస్సులో తాటిచెట్లు ఎక్కి ముంజలు తెంపడం ద్వారా ఉపాధి పొందుతున్నాడు. నిటారుగా పెరిగే తాటిచెట్లు ఎక్కడం అంత సులువుకాదని, ప్రమాదాలు కూడా ఉంటాయని తెలిపాడు. తాను యుక్త వయస్సు నుంచే తాటిచెట్లు ఎక్కడం అలవాటని పేర్కొన్నాడు. ప్రస్తుతం తాటికాయలు తెంపడం ద్వారా కుటుంబాన్ని పోషించుకున్నట్లు తెలిపాడు.



రెండు నెలలపాటు ఉపాధి

వేసవిలో రెండు నెలల పాటు తాటిముంజల వల్ల ఉపాధి లభిస్తుంది. చెట్ల నుంచి కాయలు దించి ముంజలుగా మార్చి వ్యాపారులకు విక్రయిస్తాం. సుదూర ప్రాంతాల నుంచి వచ్చి మా వద్ద ముంజలు కొనుగోలు చేస్తారు. వేసవిలో ఈ వ్యాపారం లాభసాటిగా ఉంటుంది.

– లొద్ద సంతోష్, కుల్కచర్ల



ఆరోగ్యానికి మేలు

తాటిముంజలు అన్ని వయస్సుల వారు తినొచ్చు. వేసవి కాలంలో శరీరం త్వరగా అలసిపోతుంది. తాటి ముంజలు తీసుకోవడం ద్వారా నీటిశాతన్ని పెంచుకోవచ్చు. అలసట తగ్గి ఎనర్జీ సమకూరుతుంది. జీర్ణ ప్రక్రియకు ఎంతగానో దోహదం చేస్తాయి. తాటిముంజల వల్ల చాలా ప్రయోజనాలు ఉన్నాయి.

– కిరణ్ గౌడ్, మండల వైద్యాధికారి, కుల్కచర్ల

నేడు వాజ్‌పేయి శత జయంత్యుత్సవం

హాజరవనున్న ఎంపీలు ఈటల, కొండా

మహేశ్వరం: మాజీ ప్రధాని అటల్ బిహారి వాజ్‌పేయ్ శత జయంతి ఉత్సవాలను బుధవారం నిర్వహించనున్నట్లు బీజేపీ మండల అధ్యక్షుడు టి.యాదీశ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. నాగారం పరిధిలోని కుండె వెంకటేశ్ ఫామ్ హౌస్‌లో మధ్యాహ్నం ఒంటి గంటకు నిర్వహించే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మల్కాజ్‌గిరి, చేవెళ్ల ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్‌భూపాల్ గౌడ్, కార్యక్రమ ఇన్‌చార్జి సుదర్శన్‌రెడ్డి, పాపయ్య గౌడ్, జంగయ్య యాదవ్ హాజరవుతారని చెప్పారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడు మృతి


శివ (ఫైల్)

దోమ: పురుగుల మందు సేవించిన ఓ యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన దోమ పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కొండాయపల్లి గ్రామానికి చెందిన రత్నమ్మ, నర్సింహులుకు పిచ్చకుంట్ల శివ(21), భానుప్రసాద్ ఇద్దరు సంతానం. పెద్ద కుమారుడు శివ సంగారెడ్డి జిల్లాలోని దౌల్తాబాద్‌లో ఓ ఫార్మ కంపెనీలో ప్రైవేటు ఉద్యోగం చేస్తుండగా, చిన్నకుమారుడు పేదోతరగతి పూర్తి చేసి ఇంటివద్దే ఉంటున్నాడు. ఈ క్రమంలో పెద్ద కుమారుడు గత నెలలో ఇంటికి వచ్చాడు. కుటుంబ విషయంలో తల్లితో చిన్న పాటి వాగ్వివాదం జరిగింది. దీంతో తల్లి అతన్ని మందలించడంతో మనస్థాపానికి గురై అతను గత నెల 31వ తేదీన పురుగుల మందు తాగాడు. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. శివ అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ ఆనంద్ కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్కూటీని ఢీకొట్టిన ఆటో

మొయినాబాద్: స్కూటీని వెనక నుంచి అశోక్ లేలాండ్ ఆటో ఢీకొట్టడంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్‌కు చెందిన సయ్యద్ మోయిజ్ ఈ నెల 27న జేబీఐటీ నుంచి మెహదీపట్నానికి స్కూటీపై వెళ్తున్నాడు. మార్గమధ్యలో వీఆర్‌కే కళాశాల వద్దకు రాగానే వెనక నుంచి అతివేగంతో వచ్చిన అశోక్ లేలాండ్ ఆటో ఢీకొట్టింది. దీంతో స్కూటీపై వెళ్తున్న మోయిజ్ కింద పడటంతో తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి సోదరుడు ఎండీ ఫర్దీన్ మంగళవారం మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మట్టి వాహనాల సీజ్

మాడ్గుల: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామ శివారులోని వాగు నుంచి మంగళవారం ఉదయం అక్రమంగా మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు సీఐ వేణుగోపాల్‌రావు తెలిపారు. పెట్రోలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు మట్టి ట్రాక్టర్‌ను గమనించి ప్రశ్నించగా ఎలాంటి అనుమతులు లేవని చెప్పడంతో సీజ్ చేసినట్లు చెప్పారు. డ్రైవర్, వాహన యాజమానిపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

వెస్ట్‌జోన్‌కు ఫోన్ ట్యాపింగ్ సిట్ కార్యాలయం

బంజారాహిల్స్: ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు చేస్తున్న సిట్ కార్యాలయాన్ని జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్ నుంచి రెడ్‌హిల్స్‌లోని వెస్ట్‌జోన్ కార్యాలయానికి తరలించారు. అంతేకాకుండా ఫోన్ ట్యాపింగ్ సిట్ దర్యాప్తు అధికారి, జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరిని పూర్తి స్థాయిలో ఫోన్ ట్యాపింగ్ కేసు దర్యాప్తు కోసం నియమించారు. ఈ కేసు విచారణ వేగవంతం చేయాలని, త్వరితగతిన ముగించాలనే ఉద్దేశంతో వెంకటగిరికి పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించి కార్యాలయాన్ని కూడా వెస్ట్‌జోన్‌కు తరలించారు. దీంతో జూబ్లీహిల్స్ ఏసీపీగా బంజారాహిల్స్ ఏసీపీ సామల వెంకట్‌రెడ్డికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు పూర్తయ్యేవరకు వెంకటగిరిని పూర్తిగా అదే కేసులో నిమగ్నం కావాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కేసు విచారణ నెమ్మదిస్తున్న నేపథ్యంలో ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించడంతో పోలీసు ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగానే జూబ్లీహిల్స్ ఏసీపీ వెంకటగిరి పూర్తిగా ఇదే కేసులో నిమగ్నం కావాలని, దర్యాప్తు వేగవంతం చేయాలని ఆదేశించారు. దీంతో రెండు రోజులుగా సిట్ బృందం పూర్తిగా వెస్ట్‌జోన్ కార్యాలయంలోనే విచారణ కొనసాగిస్తున్నది. ఎఫ్‌ఎస్‌ఎల్ రిపోర్టులు, ఇతరత్రా శాస్త్రీయ ఆధారాలు, ఇంకా కొనసాగించాల్సిన విచారణ వీటన్నింటిని ముమ్మరం చేయాలని కూడా సూచించారు.

రీల్స్ చేస్తూ.. క్వారీ గుంతలో పడి యువకుడి మృతి

జవహర్‌నగర్: రీల్స్ చేస్తూ ఓ యువకుడు క్వారీ గుంతలో పడి మృతిచెందిన సంఘటన జవహర్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కౌకూర్ భరత్‌నగర్‌లో నివసించే రమేష్ చిన్న కుమారుడు తరుణ్ (17) ఇంటర్మీడియట్ పూర్తి చేశాడు. మూడు రోజుల్లోనే తరుణ్ పుట్టినరోజు ఉండటంతో ఫొటోషూట్ చేద్దామని తన ఐదుగురు స్నేహితులతో కలిసి మల్కారంలోని గుట్టలు, పక్కనే ఉన్న క్వారీ గుంత వద్దకు సోమవారం సాయంత్రం వచ్చారు. తరుణ్ ఫోటో దిగుతూ క్వారీ గుంతలోకి దిగడానికి ప్రయత్నించగా..లోతు తెలియక, ఈత రాక మునిగిపోయాడు. తరుణ్‌ని బయటకు తీసేందుకు స్నేహితులు ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. వెంటనే జవహర్‌నగర్ పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సోమవారం రాత్రి కావడంతో మృతదేహాన్ని బయటకు తీయడానికి సాధ్యం కాకపోవడంతో మంగళవారం ఉదయం ఏడీఆర్ఎఫ్ బృందాలు, జవహర్‌నగర్ పోలీసుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీశారు.

చోరీలతో బెంబేలు!


విద్యానగర్‌కాలనీలోని ఓ ఇంట్లో చిందర వందరగా పడేసిన వస్తువులు (ఫైల్)


భవానీ వైన్స్‌లో గుర్తు తెలియని వ్యక్తులు (ఫైల్)

- పరిగి మున్సిపాలిటీలో రెచ్చిపోతున్న దొంగలు
- తాళం వేసిన ఇళ్లు, నూతనంగా నిర్మిస్తున్నవే టార్గెట్
- నిందితులను పట్టుకోవడంతో పోలీసుల వైఫల్యం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

పరిగి: మున్సిపాలిటీలో దొంగతనాలు రోజురోజుకు హడలెత్తిస్తున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేసిన ఇళ్లను, నూతనంగా నిర్మిస్తున్నవే టార్గెట్‌గా చేసుకుని చోరీలకు పాల్పడుతున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు అందినకాడికి అపహరించుకుపోయి బాధితులకు దుఃఖాన్నీ మిగిలిస్తున్నారు. వరుసగా దొంగతనాలకు పాల్పడుతున్నా నిందితులను పట్టుకోవడంలో పోలీసు శాఖ పూర్తిగా విఫలమవుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. పట్టణ కేంద్రంలో పదిహేను రోజులకు ఒకసారైనా గుర్తు తెలియని వ్యక్తులు ఇండ్లలో చొరబడి దొరికినకాడికి లూటీ చేస్తున్నారు. ఇంటి తాళం పగుల గొట్టి ఎంచక్క ఇంట్లోకి వెళ్లి బీరువా తెరిచి అందులోని బంగారం, వెండి, నగదును పట్టుకెళ్తున్నారు. దొంగతనానికి వచ్చిన ఆగంతకుల ఆనవాళ్లు దొరకకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

పగలు రెక్కీ... రాత్రిళ్లు చోరీ..

ఇంటికి తాళం వేసి ఇంటిల్లిపాది బంధువుల ఇళ్లకు, శుభకార్యాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్తుండటంతో గుర్తు తెలియని వ్యక్తులు ఆ సమయాన్నే అనుకూలంగా మల్చుకుంటున్నారు. చోరీ చేయడానికి వీలైన ఇళ్లను గుర్తించి సునాయాసంగా పని కానిచ్చేస్తున్నారు. ఇందుకోసం పగలు తాళం వేసిన ఇళ్లను రెక్కీ చేసి రాత్రి పూట దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. నూతనంగా ఇల్లు నిర్మిస్తున్న ఇంటి దగ్గర డబ్బులు, విలువైన వస్తువులను దొంగలించుకుపోతున్నారు. ఈ చోరీని ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు చేస్తున్నారా? లేదా సిద్ధహస్తులైన స్థానికులే చోరీలకు పాల్పడుతున్నారనే విషయం అర్థం కాకా సందిగ్ధంలో ఉన్నారు. పాత నేరస్తులపై నిఘా పెట్టకపోవడం, కొత్తగా వస్తున్న వ్యక్తులపై నిఘా ఉంచకపోవడంతో దొంగతనాలు జరుగుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. మరో వైపు రాత్రి వేళల్లో పెట్రోలింగ్‌కూడా సరిగ్గా నిర్వహించడం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు. అర్ధరాత్రి వరకు యువకులు, గుర్తు తెలియని వ్యక్తులు వీధుల్లో దర్జాగా సంచరిస్తున్నా పోలీసులు పట్టించుకోవడం లేదని పట్టణ వాసులు చెబుతున్నారు.

ఇటీవల జరిగిన సంఘటనలు...

పట్టణ కేంద్రంలోని విద్యానగర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారు. రెండు ఇళ్లల్లో చోరీకి పాల్పడి పెళ్లికి దాచుకున్న మూడు తులాల బంగారం, రూ.2లక్షల నగదును అపహరించుకుపోయారు. మార్చి 2న పట్టణ కేంద్రంలోని భవానీ వైన్స్‌లో గుర్తు తెలియని వ్యక్తులు రేకులను కోసి కౌంటర్‌లోని రూ.2లక్షల 30వేలు దొంగలించుకు వెళ్లారు. మండల పరిధిలోని హన్మన్‌గండిలో బీరువాలోని రెండు తులాల బంగారంతో పాటు నగదును అపహరించుకుపోయారు.

శాంతినగర్ కాలనీలో..

పట్టణ కేంద్రంలోని శాంతినగర్ కాలనీకి చెందిన సత్తయ్య స్క్రాప్ దుకాణం నడిపిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. దుకాణానికి వెళ్లగా మధ్యాహ్నం గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని ఐదు తులాల బంగారం దొంగలించుకువెళ్లారు. మండల పరిధిలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో ఒకే రాత్రి ఐదు ఇళ్లల్లో చోరీకి పాల్పడ్డారు. పలువురి ఇళ్లల్లో బంగారం నగదును దొంగలించుకుపోయారు.

ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం



దొంగతనాలు జరగకుండా పట్టణంతో పాటు గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం. పట్టణంలో రోజూ పర్యవేక్షిస్తున్నాం. పట్టణానికి మారుమూలాన ఉన్న ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారు. చోరీల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. నిందితులను త్వరలోనే పట్టుకుంటాం. – శ్రీనివాస్‌రెడ్డి, సీఐ, పరిగి

భూ సమస్యల పరిష్కారానికే 'భూ భారతి'


సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్

- అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్
- ఆర్‌ఓఆర్ చట్టంపై రైతులకు అవగాహన

దోమ: భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్ పేర్కొన్నారు. మంగళవారం దోమ మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన భూ భారతి కొత్త ఆర్‌ఓఆర్ చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈ చట్టం దోహదపడుతుందన్నారు. ఈ చట్టంతో పొరపాట్లు, సవరణకు అవకాశం లభించిందన్నారు. లావాదేవీల సేవలు, రిజిస్ట్రేషన్, మ్యూటేషన్, ఆర్‌ఓఆర్ మార్పులు, చేర్పులు, సాదాబైనామా లాంటి సేవలు సులభతరమవుతాయన్నారు. 3 నెలల్లో రెవెన్యూ యంత్రాంగం ప్రతీ సమస్యను పరిష్కరించే దిశగా పని చేస్తుందన్నారు. జూన్ 2వ తేదీ నుంచి జిల్లాలోని ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి భూ సమస్యలు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొత్త చట్టాన్ని రైతులందరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పురుషోత్తం, ఎంపీపీఓ గ్యామా, డిప్యూటీ తహసీల్దార్ నర్సిములు, ఆర్‌ఐలు రామచంద్రరావు, సుదర్శన్, మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్ రావు, ఎంఈఓ వెంకట్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మాలి విజయ్ కుమార్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ యాదవరెడ్డి, డైరెక్టర్లు జాకటి వెంకటయ్య, పరిగి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు ప్రభాకర్ రెడ్డి, శాంతుకుమార్, బద్రి, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ బంగ్ల యాదయ్య గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి రమేష్ గౌడ్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అనుసుజ, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రాఘవేందర్ రెడ్డి, అంతిరెడ్డి, మొగులయ్య గౌడ్, చెన్నయ్య, బొంపల్లి తండా వెంకట్, శివకుమార్ రెడ్డి, సంజీవ్ కుమార్, బందెయ్య, తదితరులు పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఐక్య పోరాటం


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్: హక్కుల సాధన కోసం కార్మికులంతా ఐక్యంగా పోరాటం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎన్.రాజు పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మేడేకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. కార్మికులు ఎనిమిది గంటల విధానం కోసం అమెరికాలో చికాగో నగరంలో పోరాడి సాధించారని గుర్తు చేశారు. ఈ విజయాన్ని మే 1వ తేదీన మేడే గా జరుపుకొంటామని వివరించారు. కార్మికులు నేటికీ శ్రమ దోపిడీకి గురువుతున్నారని.. వారి పనికి తగిన వేతనం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యంత్రాల మధ్య పని చేస్తున్న కార్మికులకు సైతం యాజమాన్యాలు రక్షణ కవచాలు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు ఎర్ర తివాచీ పరిచి కార్మికుల సంక్షేమాన్ని విస్మరిస్తున్నాయని విమర్శించారు. మేడే స్ఫూర్తితో కార్మికులు హక్కులు సాధనకు ఐక్యంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్, కార్మికులు యాదయ్య, రాజు, జంగయ్య, అంజమ్మ, శంకరయ్య, కుమార్, శివ, చెన్నకేశవులు, కమలమ్మ, మమత, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళ అదృశ్యంపై కేసు నమోదు


అరుంధతి (ఫైల్)


బసంత్‌బెహరా (ఫైల్)

మొయినాబాద్: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన మహిళ అదృశ్యమైంది. ఈ సంఘటన మొయినాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మొయినాబాద్ మున్సిపాలిటీలోని గుల్షన్ కాలనీకి చెందిన ఇంద్రపాటి సత్యనారాయణరెడ్డి భార్య అరుంధతి(50) మంగళవారం ఉదయం 7.30 గంటల సమయంలో ఇంట్లోనే ఉంది. భర్త వాకింగ్‌కి వెళ్లి 8.30 గంటలకు ఇంటికి వచ్చేసరికి భార్య కనిపించలేదు. దీంతో ఆయన పరిసర ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వెతికాడు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కొంత కాలంగా తన భార్య ఆరోగ్యం బాగోలేదని.. కుటుంబ సమస్యల కారణంగా మనస్తాపం చెంది ఇంట్లో నుంచి వెళ్లి ఉండవచ్చని ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఒడిశా వ్యక్తి..

కేశంపేట: ఆస్పత్రికి వెళ్తానని బయటికి వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన సంఘటన మండల పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేట గ్రామ శివారులో ఉన్న వేంకటేశ్వర పౌల్ట్రీ ఫాంలో వాచ్‌మెన్‌గా పనిచేసేందుకు ఒడిశా నుంచి పిటీష్ బెహరా, బసంత్ బెహరా రెండేళ్ల క్రితం వచ్చారు. సోమవారం ఉదయం అనారోగ్యంగా ఉండటంతో బసంత్ బెహరా ఆస్పత్రికి షాద్‌నగర్ వెళ్తున్నట్లు తోటి వారికి చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడం, సెల్ ఫోన్ స్విచ్చాఫ్ వస్తుండటంతో తోటి మిత్రుడు వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో మంగళవారం పోలీసులకు పిటీష్ బెహరా ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ నరహరి తెలిపారు.

కారుపై రాయితో దాడి

మొయినాబాద్: రాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను వెంబడించిన కారుపై రాయితో దాడి చేసిన సంఘటన సోమవారం రాత్రి అమ్డాపూర్‌లో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. అమ్డాపూర్‌కు చెందిన సామ మోహన్‌రెడ్డి సోమవారం రాత్రి 10.30 గంటలకు తన కారులో వ్యవసాయ పొలం నుంచి ఇంటికి వెళ్తున్నాడు. ఇదే సమయంలో గ్రామానికి చెందిన కుర్వ మల్లేశ్ ఈసీ వాగులో నుంచి ట్రాక్టర్‌లో అక్రమంగా ఇసుక తరలిస్తున్నాడు. వెనక నుంచి వెళ్తున్న తన కారుకు సైడ్ ఇవ్వకపోవడంతో మోహన్‌రెడ్డి ట్రాక్టర్‌ను వెంబడించాడు. అమ్డాపూర్‌లోని అయ్యప్ప ఆలయం సమీపంలో ఇసుక అన్‌లోడ్ చేసిన మల్లేశ్, తన ట్రాక్టర్‌ను వెంబడించిన కారుపై రాయి విసిరాడు. దీంతో అద్దం పగిలిపోయింది. వాహనం దిగిన మోహన్‌రెడ్డిపై సైతం రాళ్లతో దాడిచేయడంతో తప్పించుకుని వెళ్లి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

చిన్నారుల మిస్సింగ్

పహాడీషరీఫ్: బాలురైన ఇద్దరు అన్నదమ్ములు అదృశ్యమైన సంఘటన బాలాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎం.సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటాపూర్ గ్రామానికి చెందిన మహ్మద్ అఫ్రోజ్ కుమారులు మహ్మద్ గౌస్(11), మహ్మద్ సమీర్(9) ఈ నెల 27వ తేదీన ఇంటి బయటికి వెళ్లిన మేకలను తీసుకొస్తామంటూ వెళ్లారు. ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు ఆందోళనకు గురయ్యారు. సాధ్యమైన అన్ని ప్రాంతాలలో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో తల్లి సల్మా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వీరి ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62366 నంబర్‌లో సమాచారం ఇవ్వాలని తెలిపారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

కేశంపేట: మండల కేంద్రంలో మేడే వాల్‌పోస్టర్‌ను ఏఐటీయూసీ జిల్లా జనరల్ సెక్రెటరీ రాంచందర్ మంగళవారం ఆవిష్కరించారు. కేశంపేటలో నిర్వహించే మేడే వేడుకలను మండల వ్యాప్తంగా ఉన్న కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నాలని ఆయన కోరారు. కార్మికుల హక్కుల రక్షణ కోసం ఏఐటీయూసీ పాటుపడుతుందని తెలిపారు. జంగయ్య, బాలయ్య, కృష్ణయ్య పాల్గొన్నారు.

ఆ రెండు కాలనీల మధ్య తగ్గిన దూరం

కబ్జాలను కూల్చివేసిన హైడ్రా

సాక్షి, సిటీబ్యూరో: గండిపేట సమీపంలోని శ్రీ వెంకటేశ్వర కాలనీ, ఉస్మానియా కాలనీల మధ్య ఉన్న అడ్డంకిని హైడ్రా అధికారులు మంగళవారం తొలగించారు. దీంతో ప్రజలు నేరుగా షేక్‌పేట రావడానికి..అటు గోల్కొండ కోటకు వెళ్లడానికి దగ్గరి దారి ఏర్పడింది. నెక్నాంపూర్‌లో హైటెన్షన్ విద్యుత్ తీగల కింద రహదారిని కబ్జా చేసిన కొందరు గోడను నిర్మించారు. అక్కడ ఉన్న దాదాపు 800 గజాల స్థలాన్ని ఆక్రమించి షెడ్లు నిర్మించారు. దీంతో శ్రీ వేంకటేశ్వర కాలనీకి, ఉస్మానియా కాలనీకి మధ్య రాకపోకలకు అవాంతరాలు ఏర్పడ్డాయి. ఈ అంశంపై శ్రీ వేంకటేశ్వర కాలనీ వాసులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ప్రాథమిక విచారణ అనంతరం శనివారం హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్రస్థాయిలో పర్యటించి విషయం నిర్ధారించారు. వెంటనే అడ్డుగోడను కూల్చేయాలని ఆదేశించారు. మంగళవారం రంగంలోకి దిగిన హైడ్రా బృందాలు ఆ పనులు పూర్తి చేశాయి. ఫలితంగా రెండు కాలనీల మధ్య 30 అడుగుల వెడల్పుతో రహదారి ఏర్పడి దూరం తగ్గింది. దాదాపు మూడు వేల మంది స్థానికులకు ఉపయుక్తంగా మారింది.

వ్యవసాయాధికారులకు కొత్త నంబర్లు

నెట్‌వర్క్ సమస్యతో మారిన సెల్‌ఫోన్ నంబర్లు

తాండూరు: వ్యవసాయాధికారులు రైతులకు అందుబాటులో ఉండేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టింది. వ్యవసాయాధికారుల సెల్‌ఫోన్ నంబర్లు నెట్‌వర్క్ సమస్యతో రైతులకు అందుబాటులోకి రావడం లేదు. మరోవైపు భూ భారతి చట్టం పూర్తిగా ఆన్‌లైన్‌లో ఉండటంతో మండల వ్యవసాయాధికారులకు నెట్‌వర్క్ సమస్య తలెత్తకుండా పాత కంపెనీ సెల్ నెంబర్లను రద్దు చేసి కొత్త కంపెనీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. దీంతో జిల్లా వ్యవసాయాధికారులు, మండల వ్యవసాయాధికారుల సెల్‌ఫోన్ నంబర్లు మారాయని జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి తెలిపారు. కొత్త నంబర్లు ప్రజలకు చేరేందుకు చర్యలు తీసుకొంటున్నామన్నారు.

మండల వ్యవసాయాధికారుల ఫోన్ నంబర్లు

మండలం	ఏఓ పేరు	సెల్ నెంబర్
బంట్వారం	శ్రావ్య	897 7756 037
బషీరాబాద్	ఎస్.అనిత	897 7755 983
బొంరాస్‌పేట్	జి తులసీ	897 7755 947
చౌడాపూర్	జి.పరిమళ	897 7755 961
ధారురు	ఎం.సూర్యప్రకాశ్	897 7756 038
దోమ	ప్రభాకర్	897 7755 962
దౌల్తాబాద్	లావణ్య పెద్దింటి	897 7755 948
దుద్యాల	నాగరాజు	897 7755 949
కొడంగల్	జి. తులసి	897 7755 950
కోట్‌పల్లి	కరుణాకర్‌రెడ్డి	897 7756 051
కుల్కచర్ల	వీరస్వామి	897 7755 963
మర్పల్లి	శ్రీకాంత్	897 7756 058
మోమిన్‌పేట్	జయశంకర్	897 7756 059
నవాబ్‌పేట్	ఎం.జ్యోతి	897 7756 072
పరిగి	రజిత	897 7755 979
పెద్దేముల్	పవన్‌కుమార్	897 7756 002
పుదూర్	తులసిరాం	897 7755 980
తాండూరు	కొమరయ్య	897 7756 003
వికారాబాద్	ప్రసన్నలక్ష్మి	897 7756 073
యాలాల	శ్వేతరాణి	897 7756 004

చెరువుల పునరుద్ధరణకు చర్యలు

పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి


బాస్‌పల్లిలో కొత్తచెరువు పునరుద్ధరణకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

దోమ: చెరువుల పునరుద్ధరణకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం దోమ మండల పరిధిలోని బాస్‌పల్లి గ్రామంలో కొత్తచెరువు పునరుద్ధరణ పనులకు ఇరిగేషన్ డీఈ పార్థసారధితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు రూ.25 లక్షలతో బాస్‌పల్లి చెరువును పునరుద్ధరించనున్నట్లు పేర్కొన్నారు. కట్టబలోపేతం, కట్టకు ఇరువైపులా పెరిగిన చెట్లను తొలగించడం, ఫీడర్ చానల్‌కు మరమ్మతులతో పాటు కట్ట బలహీనపడకుండా ఉండేందుకు చర్యలు తీసుకోనున్నారని చెప్పారు. రానున్న వర్షాకాలంలో చెరువుల్లో నీరు పుష్కలంగా ఉండేలా దృష్టి సారిస్తున్నామన్నారు. చెరువులు, కుంటలు, బావులు నిండి భూగర్భజలాలు పెరిగితే బావులు, బోర్లలో నీటి సామర్థ్యం పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి, అధికార ప్రతినిధి ఈడిగి రమేశ్‌గౌడ్, యూత్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ బంగ్ల యాదయ్యగౌడ్, మాజీ సర్పంచులు అనంతయ్య, మాజీ ఉపసర్పంచ్ చెన్నయ్య, కాంగ్రెస్ నేతలు రాఘవేందర్‌రెడ్డి, అంతిరెడ్డి, మొగులయ్యగౌడ్, యాదగిరి, క్రిష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రైతు శ్రమ వర్షార్పణం

- అకాల వర్షంతో తడిసిన వరిధాన్యం
- దిక్కుతోచని అన్నదాతలు


బొంరాస్‌పేట: తడిసిన వరిధాన్యాన్ని పరిశీలిస్తున్న రైతు


తాండూరు రూరల్: చెంగోల్‌లో తడిసిన వరిధాన్యాన్ని డబ్బాలో ఎత్తుతున్న రైతు

తాండూరు రూరల్: ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే వర్షాపణం అవుతోంది. దీంతో రైతన్న గుండె చెరువవుతుంది. వరిపంట కోతలు కోసి ధాన్యం విక్రయించేందుకు 15 రోజులుగా రోడ్డుపైనే ఉంచాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధాన్యం కాపాడుకునేందుకు రైతన్నలు రాత్రి, పగలు కుప్పల వద్ద పడిగాపులు కాస్తున్నారు. మంగళవారం కురిసిన అకాల వర్షానికి చెంగోల్–అంతారంతండా భూకైలాస్‌మార్గంలో ఆరబెట్టిన ధాన్యం తడిసిముద్దయింది. రోడ్డుపై కొట్టుకపోతున్న వరిధాన్యాన్ని రైతులు డబ్బాలతో ఎత్తి ఆరబెడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట కళ్లముందే నీటి పాలవుతుందని కంటతడి పెడుతున్నారు. ప్రభుత్వం త్వరగా కొనుగోలు చేస్తే ఈ పరిస్థితి ఉండదని రైతులు చెబుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: మంగళవారం సాయంత్రం కురిసిన అకాల వర్షంతో మండలంలో పలుచోట్ల ఆరబోసిన వరిధాన్యం తడిసి ముద్దయింది. గాజులకుంట తండా, బాపల్లి, లింగన్‌పల్లి రహదారుల్లో ఆరబోసుకున్న ధాన్యం తడిసింది.



బొంరాస్‌పేటలో మురుగు నీటి మడుగు

బొంరాస్‌పేట ప్రధాన కూడలిలో భూలక్ష్మీ చౌరస్తా వద్ద ఏర్పడిన మురుగు గుంత ఐదేళ్లుగా ఆరిపోవడం లేదు. నిత్యం రద్దీగా ఉండే ప్రదేశం కావడంతో బాటసారులు, వాహనదారులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. డ్రైనేజీలో నెలకొన్న లీకేజీల కారణంగానే ఈ దుస్థితి నెలకొందని చెబుతున్నారు. సమస్య పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని కోరుతున్నారు. – బొంరాస్‌పేట

దోర్నాల్ బ్రిడ్జిపై సీసీ బెడ్ పనులు

- రెండు రోజుల్లో పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ వెల్లడి
- త్వరలోనే ప్రారంభంకానున్న రాకపోకలు

ధారూరు: మండల పరిధిలోని స్టేషన్‌ధారూరు–దోర్నాల్ గ్రామాల మధ్య కాగ్నా నదిపై నిర్మించిన వంతెన మీద మంగళవారం సీసీ బెడ్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రెండు రోజుల్లో వీటిని పూర్తి చేస్తామని ఆర్‌అండ్‌బీ తాండూరు ఏఈ శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆవెంటనే రోడ్డు పనులు చేపట్టి రాకపోకలను పునరుద్ధరిస్తామని చెప్పారు. ఎనిమిదేళ్లుగా ఈ బ్రిడ్జి నిర్మాణం కొనసాగిన నేపథ్యంలో వాగు దాటుతూ పలువురు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. పశువులు, మేకలు, గొర్రెలు సైతం మృత్యువాత పడ్డాయి. వంతెన అందుబాటులోకి వస్తే తమ ఇక్కట్లు తీరినట్లేనని మండల ప్రజలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

దోర్నాల్– స్టేషన్‌ధారూరు మధ్య నిర్మించిన వంతెనపై కొనసాగుతున్న పనులు
